క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వెల్దండ: మండలంలోని బైరాపూర్ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మేదినిపూజ, విశ్వక్సేన ఆరాధన రక్షాబంధనం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

అపరిశుభ్రంగా వాటర్‌ట్యాంక్‌లు

కోడేరు: మండల కేంద్రంలో తాగునీటి వాటర్ ట్యాంక్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్తుల వాపోయారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత గ్రామ ప్రత్యేక అధికారులు ఇప్పటి వరకు ట్యాంక్‌లను శుభ్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితం నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి స్పందించి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నెల రోజులుగా నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ క్రీడా సంస్థ సౌజన్యంతో కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ముగింపు సమావేశానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఎస్ఐ మాధవరెడ్డిలు హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలను బహూకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, కార్యదర్శి సుధాకర్, శిక్షకుడు నవీన్, పప్పురాజు, శశి, అంజి, రాజు పాల్గొన్నారు.

దాతకు సన్మానం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామస్తులకు బొబ్బిటి కృష్ణారెడ్డి తన స్వంత ఖర్చులతో వ్యవసాయ బోరు నుంచి తాగునీటి తీసుకొచ్చి గ్రామస్తులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామ పంచాయతీ కార్యదర్శి శర్మ, సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం గురుకుల కళాశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ విజయగౌడ్ తెలిపారు. ఇటీవల 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు శ్రీచరన్ ఎంపీసీ గ్రూపు కిందకే టీదొడ్డి, మోహన్‌గౌడ్ ఎంపీసీ అంబడిపల్లి, వైష్ణవి కోడేరు ఎంపీసీ కళాశాలలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. విద్యార్థులు గురుకులాల్లో సీట్లు దక్కించుకున్నవారిని ఉపాధ్యాయులు అభినందించారు.

పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత

నాగర్‌కర్నూల్ క్రైం: పిడుగుపాటుకు గొర్రెలు, పొటేళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని గన్యాగుల గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. బొందలపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య తన గొర్రెలు, పొటేళ్లను మేపేందుకు గన్యాగుల గ్రామ శివారుకు తీసుకెళ్లగా అదేసమయంలో పిడుగుపడి 8 గొర్రెలతో పాటు 2 పొటేళ్లు మృతి చెందాయి. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

రాజ్యాంగాన్ని టీవీల్లో ప్రసారం చేయాలి

మన్ననూర్: రామాయణం, మహాభారతం మాదిరిగా భారత రాజ్యాంగాన్ని కూడా టీవీల్లో ప్రసారం చేయాలని మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాలు రాజ్యాంగ ఆవశ్యకతపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలను తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగ భేదం లేకుండా అందరికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు.

గ్రామాల్లో సమస్యలు తిష్ట

• వేధిస్తున్న నిధుల కొరత



పేరుకున్న మురుగు



నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్న పల్లె ప్రకృతివనం

తాడూరు: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో సమస్యలు అధికమయ్యాయి. ప్రత్యేక అధికారులు కార్యాలయాలకే పరిమితం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో తాగు, విద్యుత్, విద్య, పారిశుద్ధ్య సమస్యలు తిష్టవేశాయి. నిధులు కొరతతో గ్రామ పంచాయతీలలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పారిశుద్ధ్య సమస్యలతో గ్రామస్తులు సతమతమవుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు నియమించినప్పటికి వారు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. పలు పంచాయితీలలో మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో పనులు ఎలా చేయాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరత

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అభివృద్ధికి నిధుల కొరత వేధిస్తోంది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారులను నియమించారు. పరిపాలనా, పర్యవేక్షణ బాధ్యతలతోపాటు పంచాయతీ కార్యదర్శితో కలిసి ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ ఇచ్చారు.

కష్టంగా పంచాయతీల పాలన

కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి విడుదలయ్యే నిధులు గత 15 నెలలుగా ఆగిపోయాయి. దీంతో పంచాయతీల పాలన సాగించడం కార్యదర్శులకు ఇబ్బందిగా మారింది. దీంతో జనరల్ ఫండ్ తోపాటు మిగిలిన చాలీచాలని నిధులతో పాలనను వెళ్లదీస్తున్నారు. పంచాయతీలలో ట్రాక్టర్ల వాయిదాలు చెల్లించకపోవడంతోపాటు వాటికి మరమ్మతు చేయించలేని దుస్థితి నెలకొంది. ప్రత్యేకాధికారులకు మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదు.

వేతనాల చెల్లింపులో జాప్యం

మండలంలో ఉన్న 24 గ్రామ పంచాయతీలలో దాదాపు 60 మదికి పైగా మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు. వీరికి దాదాపు నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు.

దిక్కుతోచని స్థితిలో కార్యదర్శులు

నిధులు లేక గ్రామ పంచాయతీ కార్యదర్శులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు కేవలం పర్యవేక్షణకే పరిమితం అవుతున్నారు. నిధుల కొరత గురించి అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నారు.

వేతనాలు చెల్లించాలి



గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఆందోళన చేపడతాం. ప్రభుత్వం పంచాయతీలకు నిధులను విడుదల చేస్తే కార్మికుల వేతనాలకు ఇబ్బంది ఉండదు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోడం సరికాదు. వెంటనే వేతనాలు ఇవ్వాలి.

–కాశన్న, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు

నిధులు మంజూరు కాలేదు

గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లిస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు.

– లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ తాడూరు

కురిసిన మోస్తరు వర్షం



సుద్దకల్‌లో ఇళ్ల మధ్య చేరిన నీరు

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్, గుండూరు, రఘుపతిపేట, తోటపల్లి తదితర గ్రామాలలో మోస్తరు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో సతమతం అవుతున్న మండల వాసులకు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో కొంత ఊరట లభించింది. పలు కాలనీలలో వర్షపునీరు నిలిచింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.



తిమ్మాజిపేట రోడ్డుపై విరిగి పడిన చెట్టు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలో సోమవారం వీచిన ఈదురు గాలులకు జడ్చర్ల, తిమ్మాజిపేట ప్రధాన రహదారిపై ఓ చెట్టు విరిగిపడింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు. ప్రయాణికులు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు పనిభారం తగ్గించాలి

తెలకపల్లి: అంగన్‌వాడీ టీచర్లకు అదనపు పనిభారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు అదనంగా కేటాయించిన బీఎల్‌ఓల విధులు లేకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. 2008 నుంచి బీఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహిస్తే కేవలం రూ.250 ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. బీఎల్‌ఓలుగా అంగన్‌వాడీ టీచర్లు కొనసాగాలంటే ప్రతి నెల రూ.500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐ రామస్వామికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసులతోపాటు అంగన్‌వాడీ వర్కర్స్, జిల్లా కార్యదర్శి పి చంద్రకళ, సుకన్య, అక్బరీ, రేవతి, మంజుల, సుజాత, మంజుల, రామచంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌ఓలు

ఎల్‌ఓసీ అందజేత



కల్వకుర్తి టౌన్: పట్టణానికి చెందిన చిరంజీవి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.2.5లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు సోమవారం మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ ఎల్‌ఓసీని అందజేశారు. సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు విజయ్‌కుమార్, శ్రీకాంత్, షానవాజ్, చిన్న, రాంపర్వతాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

కొల్లాపూర్: పట్టణంలోని 19వ వార్డులో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణాలను వార్డు కౌన్సిలర్ శ్రీదేవీ గౌతంగౌడ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



చారకొండ: మండలంలోని జూపల్లి, తిమ్మాయిపల్లి, సారంబండ తండాలను సోమవారం ఎంపీఓ వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల పరిశీలన, వాటి సంరక్షణ తదితర వాటిపై ఆరా తీశారు. గ్రామాల్లో కంపోస్టు షెడ్లు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు పరిశీలించి వాటి నిర్వహణ తదితర వాటిపై పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీలో సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు, లక్ష్మి, కృష్ణకాంత్, వినోద్ తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

లింగాల: మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని వల్లభాపూర్‌లో ఉపాధి హామీ పనులతో పాటు నర్సరీని పరిశీలించారు. నర్సరీలలో ఏపుగా పెరిగే మొక్కలను పెంచాలని, ఇప్పటికే సిద్ధంగా ఉన్న మొక్కలు ఎండి పోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలకు పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ కర్ణనాయక్ పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం

పెద్దకొత్తపల్లి: ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వెనచర్లలో రెవెన్యూ అధికారులు ధరణి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యూసూఫ్‌అలీ, ఆర్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



చారకొండ: రైతులకు విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ చిన్న హుస్సేన్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో ఫర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చిన్న హుస్సేన్ మాట్లాడుతూ దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, స్టాక్ రిజిస్టర్ బోర్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విక్రయాలకు సంబంధించి రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించాలని కోరారు.

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా అనసూయ

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎస్.అనసూయ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె నాగర్‌కర్నూల్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ జి.మాధవి విదేశీ పర్యటనకు వెళ్లింది. దీంతో జూలై 10 తేదీ వరకు ఎస్.అనసూయకు అదనపు బాధ్యతలను అప్పగించారు. కళాశాల సీనియర్ అధ్యాపకుడు బగవేణి నరసింహులు, అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి .సైదులు జిల్లా ఇంటర్ విద్య కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.ఏ నిరంజన్, కళాశాల సీనియర్ అసిస్టెంట్ జూలూరి ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, సబార్డినేట్ బాలేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం

అచ్చంపేట రూరల్: మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ ఆరోపించారు. సోమవారం మండలంలోని నడింపల్లి, చెంచుపల్లుతండా, లక్ష్మాపూర్ శివారులో ఉపాధి హామీ పని ప్రదేశాలను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని, పని ప్రదేశాలలో మంచినీటి వసతి, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణయ్య, మల్లేష్, సత్యనారాయణ, లింగమయ్య, తిరుపతయ్య, మహిళా కూలీలు చంద్రకళ, సైదమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



లింగాల: మండలంలోని శాయిన్‌పేటలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాల్‌రాంనాయక్ అన్నారు. సోమవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. నీటి సమస్య ఉన్న వార్డులను గుర్తించారు. చేతి పంపులకు సింగిల్ ఫేస్ మోటార్లను బిగిస్తున్నట్లు ఏఈ తెలిపారు. గ్రామంలో పైపు లైన్లలో ఉన్న లీకేజీలను సరి చేయిస్తున్నామని వివరించారు. చేతి పంపులకు ఏర్పాటు చేసిన మోటార్లను జాగ్రత్తగా వాడుకోవాలని, ఇష్టానుసారంగా నీటిని వాడితే మోటార్లు కాలిపోతాయని సూచించారు. ఎంపీటీసీ లింగస్వామి, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి

వెల్దండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎంపీపీ పుట్ల రాంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. వరి పంటలకు బోనస్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. రైతుబంధు పథకం ఎకరానికి రూ.15 వేలు అందించాలన్నారు. మహిళలకు నెలకు రూ.2500 అమలు చేయాలని కోరారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, నాయకులు మధుసూధన్‌రెడ్డి, ప్రభాకర్, నర్సింహ్మముదిరాజ్, సోమయ్య, భీమయ్యగౌడు, శ్రీను తదితరులు ఉన్నారు.

పారితోషికం డబ్బులు చెల్లించాలని వినతి



తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీటీచర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన అంగన్‌వాడీ టీచర్లకు పారితోషికం డబ్బులు రూ.600 లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాగర్‌కర్నూల్ తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ నవంబర్ 30న అసెంబ్లీ, ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు రావాల్సిన రెమ్యూనరేషన్ డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు జయమ్మ, అంజనమ్మ, హేమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

వెల్దండ: పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకానికి రైతుల వ్యవసాయ పొలంలో నీటి సౌకర్యం ఉన్నవారే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐదు ఎకరాల లోపు వ్యవసాయ పొలం ఉండాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్, టెక్నికల్ అసిసెంట్లు రాజ్‌కుమార్, లక్ష్మీదేవి, శివలీల, సత్యనారాయణ, లింగస్వామి, ఫీల్డ్ అసిసెంట్లు తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



వెల్దండ: మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణలో ఐక్యత ఫౌండేషన్, వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, జీహెచ్ఎం శంకర్, దార్ల చిత్తరంజన్‌దాస్, వనం విజయ్‌కుమార్, నాయకులు నరేందర్, రమేష్, భాస్కర్, రాహుల్, మల్లేష్, జ్యోతి, శ్రీకళ, ప్రసన్న, మంజుల, రవళి, ప్రేమలత, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తిరూరల్: విద్యుత్ మరమ్మతు చేపడుతున్న సందర్భంగా కల్వకుర్తి సబ్‌డివిజన్ పరిధిలోని 5 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోనే పాత సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రెండు ఫీడర్‌లలో ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రాచూరు, తర్నికల్, పోల్కంపల్లి, గొల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ చంద్రశేఖర్ సోమవారం విలేకరులతో తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ శివాజీ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, మహబూబ్‌నగర్ చౌరస్తా, మార్గాల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి, బైరాపూర్, రాచూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సూర్యంనాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: సమాజంలో రోజురోజుకు అంతరించిపోతున్న కుటుంబ వ్యవస్థలను కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు తమ పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయాల కుటుంబ వ్యవస్థ ఆవశ్యకతను వివరించాలని అప్పాల ప్రసాద్ కోరారు. సోమవారం రాత్రి పట్టణంలోని పద్మశాలి భవనంలో సామాజిక సమరసత వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం టీవీలలో వస్తున్న సీరియల్స్ కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేసేలా ఉంటున్నాయన్నారు. కుటుంబాలు బాగుంటేనే దేశం బాగుంటుందని వివరించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ ఆంజనేయులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



తాడూరు: మండలంలోని శిర్సవాడలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మండపారాధన, ధ్వజారోహణం, అంకురార్పణ, మహా కుంబాభిషేకం, స్వామివారికి ప్రత్యేక అలంకరణ వంటి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు వసతులు కల్పించారు. పూజారి జగదీశ్వరాచారి, మాజీ సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, అమరావతి, భక్తులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. భక్తులు బోనాలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు దామోదర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, లింగం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మండలంలోని గోకారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ అభివృద్ధి, బీటీ రోడ్డు తదితర వాటిపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బోడ్డుపల్లి శ్రీను, లింగాచారి, ఎండీ నిరంజన్, కృష్ణయ్య, రామకృష్ణ, మల్లయ్య, బాలరాజు, పరుశురాం తదితరులు ఉన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల: సర్వసభ్య సమావేశం ఈ నెల 22న బుధవారం స్థానిక మండల కాంప్లెక్స్‌లోని రైతువేదికలో ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు హాజరుకావాలని కోరారు.